క్లుప్తంగా

ఘనంగా పడిపూజ



ఏలేశ్వరం పడిపూజలో పాల్గొన్న అయ్యప్పస్వాములు

ఏలేశ్వరం: పట్టణంలో ఆదివారం అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. స్వామియే శరణమయ్యప్ప అంటూ శరణుఘోషతో పట్టణం మార్మోగింది. గురుస్వాములు పూర కృష్ణ, జింకల సత్యనారాయణ ఆధ్వర్యంలో గుర్రం లోవరాజు, మహాగంగ దంపతులతో పడిపూజ నిర్వహించారు. పట్టణం, పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్పభక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పడిపూజ చేశారు. కార్యక్రమంలో అడపా దుర్గారావు, పిన్నం శివరామకృష్ణ, యల్లంరాజు, సత్యనారాయణ, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏలేరులో స్వల్పంగా తగ్గిన నీటి నిల్వలు



ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు జలాశయంలో నీటినిల్వలు స్వల్పంగా తగ్గాయి. కొద్దిరోజులుగా వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టులో నీటినిల్వలు తగ్గుముఖం పట్టాయి. ఇటీవల జలశయం పరివాహక ప్రాంతం నుంచి 580 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. ఆదివారం నాటికి ప్రాజెక్టులో 86.56 మీటర్లకు గాను 85.11 మీటర్లు నీటి నిల్వలు ఉన్నాయి. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థం 24.11 టీఎంసీలు కాగా 17.95 టీఎంసీలకు నిల్వలు చేరుకున్నాయి. ఆయకట్టుకు 600, విశాఖకు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. పంపా, తిమ్మరాజు చెరువుకు నీటి విడుదల నిలిపివేశారు.

ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగుల నిరసన



గోకవరంలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

గోకవరం: తమకు పెన్షన్ పెంచాలని కోరుతూ ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగులు గోకవరంలో ఆదివారం నిరసన తెలిపారు. ఏపీఆర్పీఏ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ పిలుపు మేరకు విశ్రాంత ఉద్యోగలు ఆదివారాన్ని విద్రోహ దినంగా పాటిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పెన్షన్ స్కీం ప్రారంభించి నేటికి 29 సంవత్సరాలు గడిచినప్పటికీ పెన్షన్ విధానంలో మార్పు రాలేదన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో పనిచేసిన కార్మికులు, ఉద్యోగులకు మినిమం పెన్షన్ రూ.1000, గరిష్టంగా రూ.3500 మాత్రమే వస్తుందన్నారు. 30 సంవత్సరాల పని చేసిన ఉద్యోగులకు వస్తున్న పెన్షన్ కనీసం మందుల ఖర్చులకు కూడా సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ పెంచాలని అనేక ఉద్యమాలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ పెంచాలని కోరారు. పలువురు విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:	
తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540
కిర్లంపూడి:	
తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	- 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	- 89789 41840
హౌసింగ్ ఏఈ	- 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	- 97014 77778

ఎంటర్ ది డ్రాగన్

- మెట్టలో డ్రాగన్ ఫ్రూట్ సాగుపై రైతుల ఆసక్తి
- మూడేళ్లు కష్టపడితే సిరులు
- ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రోత్సాహకాలు



మెట్టలో డ్రాగన్ ఫ్రూట్ సాగుకు నాటిన సిమ్మెంట్ స్తంభాలు

జగ్గంపేట: మార్కెట్‌లోకి ఏ కొత్తరకం పంట వచ్చినా శ్రద్ధతో సాగు చేసి లాభాలు ఆర్జించడం మెట్ట ప్రాంత రైతులకు పరిపాటి. గతంలో పొగాకు, కర్ర పెండలం, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగు చేసిన రైతుల ముంగిటకు ఇప్పుడు మరో కొత్తరకం పంట వచ్చింది. అదే డ్రాగన్ ఫ్రూట్. మూడేళ్లు ఓపిక పట్టి, కష్ట పడి సాగు చేస్తే అక్కడ నుంచి రైతులకు సిరులు కురిపిస్తుందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. జగ్గంపేట మండలంలోని కొందరు రైతులు ఇప్పటికే డ్రాగన్ ఫ్రూట్ సాగు ప్రారంభించారు. వారు లాభాల బాటలో పయనించడంతో మరికొంత మంది రైతులు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

అనుకూలమైన నేల, వాతావరణం

మెట్టప్రాంతమైన జగ్గంపేట మండలంలో నేలలు ఉద్యానపంటలకు ఎంతో అనుకూలంగా ఉంటాయి. గతంలో ఇక్కడ అనేక రకాల పంటలు సాగు చేసి రైతుల లాభాలు ఆర్జించారు. పొగాకు, కర్రపెండలం, కూరగాయలు, ఆయిల్ పామ్ పంటలు రైతులకు మంచి లాభాలను తెచ్చిపెట్టాయి. గతంలో ఆయిల్ పామ్ సాగు ప్రారంభమైనప్పుడు రైతులు తర్జనభర్జన పడ్డారు. అనంతరం ఒకరి తర్వాత ఒకరు ఆయిల్ పామ్ వైపు మళ్లారు. ప్రస్తుతం డ్రాగన్ ఫ్రూట్ సాగుకు అవసరమైన ఎర్ర నేలలు, వాతావరణం జగ్గంపేట నియోజకవర్గంలో ఉంది. ప్రస్తుతం జగ్గంపేట మండలంలోని నరేంద్రంపట్నం, మామిడాడ గ్రామాల్లో కొంతమంది రైతులు సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ పంట ఆరోగ్యకరంగా ఎదుగుతూ అందరినీ ఆకట్టుకుంటోంది.

పెట్టుబడి ఎక్కువే

డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసే రైతులు మూడు సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టాలి. ఎకరాకు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఖర్చవుతుంది. డ్రాగన్ ఫ్రూట్ సాగు చేయడానికి ఎకరాకు 400 సిమెంట్ స్తంభాలు వేసి 1600 మొక్కలు నాటాలి. యాజమాన్య పద్ధతులు చేపట్టి మొక్కలను సంరక్షించాలి. సాగు మొదటి సంవత్సరం ఖర్చు ఎక్కువగా ఉంటుంది. రెండో సంవత్సరం, మూడో సంవత్సరం క్రమంగా ఖర్చు తగ్గుతుంది.

మూడో ఏట నుంచి దిగుబడులు

డ్రాగన్ ఫ్రూట్ వేసిన రెండో ఏడాది చివరి నెల నుంచి దిగుబడులు ప్రారంభమవుతాయి. మూడో సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో దిగుబడులు వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఎకరాకు 3 నుంచి 3.5 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ఎకరాకు సుమారు రూ.5 లక్షలు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.



నరేంద్రంపట్నంలో రైతులతో కలిసి డ్రాగన్ పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

మంచి గిరాకీ

డ్రాగన్ ఫ్రూట్‌కు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. దీనిలో ఎక్కువగా పోషక విలువులు ఉండటం, అనేక వ్యాధులు రాకుండా ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుందని వైద్యులు చెప్పడంతో డ్రాగన్ ఫ్రూట్‌కు డిమాండ్ బాగా పెరిగింది. దీని ధర మార్కెట్లో ప్రస్తుతం కేజి రూ.150 నుంచి రూ.300 వరకూ పలుకుతోంది.

హెక్టారుకు రూ.30 వేల ప్రోత్సాహకాలు

డ్రాగన్ ఫ్రూట్ సాగు వైపు రైతులను మళ్లించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోంది. మూడు సంవత్సరాలకూ కలిపి విడతల వారీగా రూ.30 వేలు సబ్సిడీ ఇస్తోంది. రైతులకు మరింత మేలు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



మెట్ట రైతులకు మేలు



డ్రాగన్ ఫ్రూట్ సాగుకు మెట్టప్రాంతం ఎంతో అనుకూలం. ఇప్పటికే మెట్టలో కొంతమంది రైతులు ఈ పంటను సాగు చేశారు. పెట్టుబడి కొంచెం ఎక్కువైనా రైతులకు భవిష్యత్‌లో మంచి ఆదాయం వస్తుంది. రైతులకు పూర్తి సమాచారం, సహకారం అందించడానికి ఉద్యానశాఖ అధికారులు సిద్ధంగా ఉన్నారు.

– లావణ్య, ఉద్యానశాఖాధికారి, జగ్గంపేట

వైభవంగా వనభోజనాలు

పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో కార్తిక వనసమారాధనలు నిర్వహించారు. వివిధ సంఘాలు, సామాజిక వర్గాల వారు తోటలు, పార్కుల్లో ఆత్మీయంగా కలుసుకుని వనభోజనాలు చేశారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

- కార్తిక దామోదరునికి విశేష పూజలు
- ఆటపాటలతో సందడి చేసిన యువత

తుని: పవిత్ర కార్తికమాసంలో వన సమారాధనకు ఉన్న ప్రాముఖ్యతను స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థులు నృత్యరూపంలో కళ్లకు కట్టినట్టు చూపించారు. శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో సందడి చేశారు. నిత్యం క్లాసులతో గడిపే విద్యార్థులకు ఆట విడుపు కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపాల్ భానుమూర్తి తెలిపారు. అలాగే తుని క్షత్రియ పరిషత్, బ్రాహ్మణ సంఘం వన సమారాధనలు ఘనంగా జరిగాయి. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారిని సత్కరించారు.



తుని కార్తిక వన సమారాధనలో అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఆర్యవైశ్య వనసమరాధన

జగ్గంపేట: గ్రామంలో ఆదివారం ఆర్యవైశ్య కార్తిక వనసమారాధన నిర్వహించారు. వనసమారాధనకు ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియిమితులైన కొత్త కొండబాబు దంపతులు, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా నియమితులైన మానేపల్లి బంగార్రాజు దంపతులను ఆర్యవైశ్య సంఘం నేతలు సత్కరించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘంలో నిరుపేదలకు కుట్టు మెషీన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, పాలకుర్తి సురేష్, మానేపల్లి వీర్రాజు గుప్తా, కంచర్ల బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో...

ప్రత్తిపాడు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక ఆయిల్ పామ్ తోటలో ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఆదర్శ రైతు కర్రి రామకృష్ణారెడ్డి దంపతుల అధ్వర్యంలో ఉసిరిచెట్టు వద్ద కార్తిక దామోదరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో ప్రత్తిపాడు, కిర్లపూడి మండలంలోని వేలంక, సింహాద్రిపురం, జగపతినగరం, కిర్లంపూడి, చిల్లంగి, ప్రత్తిపాడు మండలంలోని రాచపల్లి, ధర్మవరం తదితర గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. మండలంలోని లంపకలోవ గ్రామ సమీపంలోని కొమ్ముల శ్రీరామమూర్తి పొలంలో బలిజ సామాజిక వర్గం, ఆయిల్ పామ్ తోటలో కాపు సామాజిక వర్గం వన సమారాధనలు జరిగాయి.

కాపుల సంక్షేమానికి కృషి చేద్దాం

జగ్గంపేట: కాపుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కలసికట్టుగా కృషి చేద్దామని కాపు నేతలు పిలుపునిచ్చారు. జగ్గంపేటలోని కాపు కల్యాణ మండపంలో ఆదివారం కాపు వనస మారాధన నిర్వహించారు. జిల్లాకు చెందిన కాపు నేతలు, ఆ సామాజికి వర్గానికి చెందిన ప్రజలు కుటుంబ సమేతంగా తరలివచ్చి ఉత్సాహంగా గడిపారు. టీడీపీ నేత మారిశెట్టి భద్రం పర్యవేక్షణలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కాపు వనసమారాధన ఏర్పాటు చేశారు. జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ, కాకినాడ మాజీ ఎంపీ వంగాగీత, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, జిల్లా కాపు జేఏసీ నేతలు వాసిరెడ్డి ఏసుదాస్, ఆకుల వీర్రాజు, జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా కాపుల ఓట్లు కీలకమన్నారు. కాపుల్లో వెనకబడిన వారి అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనంతబాబు, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మలబాబు, పార్టీ నేతలు పేరాబత్తుల రాజశేఖర్, మర్రెడ్డి శ్రీనివాస్, వరుపుల తమ్మయ్య బాబు పాల్గొన్నారు.



జగ్గంపేట వనసమారాధనలో మాట్లాడుతున్న కాపు నేతలు

లైబ్రరీ మూత.. విజ్ఞానానికి వెత

- ప్రత్తిపాడులో రెండుళ్లుగా మూత పడిన గ్రంథాలయం
- ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని వైనం
- నిధులు విడుదల చేయని గ్రంథాలయ శాఖ
- తెరిపించాలని కోరుతున్న పాఠకులు



ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం పైఅంతస్తులో మూసి ఉన్న గ్రంథాలయం

ప్రత్తిపాడు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. భాషా వికాసానికి పట్టుకొమ్మలు. స్వాతంత్య్రం పూర్వం నుంచి గ్రంథాలయాలకు ఎంతో చరిత్ర, ఆదరణ ఉంది. ఇలాంటి గ్రంథాలయాలు నేడు నిరాదరణకు గురవుతున్నాయి. పాఠకులకు విజ్ఞానంతో పాటు విలువైన సమాచారం అందించడంలో ప్రధాన పాత్ర పోషించే గ్రంథాలయాలు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అభివృద్ధి చెందాయి. గ్రంథాలయాల్లోని ఖాళీగా పోస్టులను ఆయన ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేశారు. వైఎస్ఆర్ మరణానంతరం ఖాళీలు భర్తీకి నోచుకోలేదు సరికదా గ్రంథాలయ సంస్థ కనీసం మరమ్మతులకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. మరమ్మతులకు నోచుకోకపోవడం, పంచాయతీల్లో వీటి సెస్సు బకాయిలు పెరుకుపోవడంతో వంటి కారణాలతో నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు గ్రంథాలయం మూత పడింది. ఈ గ్రంథాయాలనికి ఏళ్ల తరబడి మరమ్మతులు లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది.

1981లో మంజూరు

1981లో అప్పటి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొప్పన కొండలరావు హయాంలో ప్రత్తిపాడుకు గ్రామీణ గ్రంథాలయం మంజూరైంది. అప్పట్లో పంచాయతీ కార్యాలయంలోని ఓ గదిలో దీన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. 1985లో అప్పటి మంత్రి ముద్రగడ పద్మనాభం కృషితో గ్రామీణ గ్రంథాలయాన్ని అప్ గ్రేడ్ (తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రం) చేసి, గ్రేడ్ 2 గ్రంథాలయాల జాబితాలో చేర్చారు. ప్రత్తిపాడు గోవిందరాజులు చెరువు గట్టుపై ఉన్న గ్రామీణ పశువైద్యశాలను మరో కొత్త భవనంలోకి మార్చడం, ఖాళీగా ఉన్న పశువైద్యశాలలోకి గ్రంథాలయాన్ని తరలించారు. ఆనాటి నుంచి మరమ్మతులు లేకపోవడంతో క్రమేపీ శిథిలస్థితికి చేరుకుంది. పలుమార్లు పాఠకులపై శ్లాబ్ పెచ్చులు ఊడిపడటంతో గాయాలైన సంఘటనలూ చోటు చేసుకున్నాయి. ఇలా 2015 వరకు శిథిలమైన భవనంలోనే గ్రంథాలయం కొనసాగింది. ప్రస్తుతం ఈ భవనానికి వెళ్లే మార్గం పూర్తిగా ఆక్రమణల చెరలో ఉంది.

పుస్తక భాం0డాగారానికి చెదలు

గ్రంథాలయం శిథిలమవడం, వర్షం వస్తే విలువైన గ్రంథాలు తడిసిపోవడం రివాజుగా మారింది. ఈ గ్రంథాలయంలో 14 వేల పుస్తకాలు ఉండేవి. ఇవి కాక ఆరు వార పత్రికలు, ఆరు మాస పత్రికలు, నాలుగు పక్ష పత్రికలు, ప్రతిరోజూ దినపత్రికలు వచ్చేవి. గ్రంథాలకు చెదలు పట్టి, తడిసి తదితర కారణాల వల్ల సుమారు ఐదు వేల పుస్తకాలు ధ్వంసమయ్యాయి. పుస్తకాలు అందుబాటులో లేకపోవడం, గ్రంథాలయం అభివృద్ధికి నోచుకోకపోవడం తదితర కారణాలతో గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్య క్రమేపీ తగ్గిపోయింది. గ్రంథాలయానికి సొంత భవనం నిర్మించాలన్న ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది.

అరకొర వసతులతో..

గ్రంథాలయం పూర్తిగ శిథిలమవ్వడంతో దీనిని గ్రామ కచేరీ భవనం (ప్రస్తుతం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం)పై అంతస్తులోకి మార్చారు. దీనిలో సౌకర్యాలు కరువవ్వడంతో పాఠకులకు ఇబ్బందులు తప్పేవికావు. చిన్నపాటి గదిలో గ్రంథాలయం నిర్వహిస్తుండడంతో గ్రంథాలయానికి రావడానికి మక్కువ చూపలేదు. పాఠకులు చదువుకోవడానికి తగినన్ని బల్లలు కానీ, కుర్చీలు కానీ లేవు. ఎండలో నిలబడే చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కనీసం గ్రంథాలయాన్ని తెలిపే బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు.

సిబ్బంది కొరతతో..

రెండేళ్ల క్రితం ప్రత్తిపాడు గ్రంథాలయాధికారి కోటనందూరుకు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి సిబ్బంది నియామకం జరగకపోవడంతో ఈ గ్రంథాలయం తెరుచుకోలేదు. దీంతో గత రెండేళ్లుగా గ్రంథాలయ వారోత్సవాలు, వేసవి శిక్షణా శిబిరాలు కనుమరుగయ్యాయి. ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులో గ్రంథాలయ పన్నులు కూడా వసూలు చేస్తున్నారు. సెస్సు రూపంలో పంచాయతీకీ ఆదాయం వస్తున్నా గ్రంథాలయ నిర్వాహణపై ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు విజ్ఞాన్ని అందించే గ్రంథాలయానికి భవనం నిర్మించి, వసతులు సమకూర్చాలని పాఠకులు కోరుతున్నారు.

గ్రంథాలయాన్ని తెరవాలి



నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో ఐసీడీఎస్ కార్యాలయం పైఅంతస్తులో ఏర్పాటు చేసిన లైబ్రరీని తెరవాలి. ప్రతిరోజూ ఈ ప్రాంతవాసులు దినపత్రికలతో పాటు ఇతర పత్రికలు చదువుకోవడానికి గ్రంథాలయానికి వస్తారు. రెండేళ్లుగా మూత పడటంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు.

– జక్కా సత్యనారాయణ, విశాంత ఉద్యోగి, ప్రత్తిపాడు

మూసేయడం బాధాకరం



గ్రంథాలయాధికారులకు లైబ్రేరీల నిర్వహణపై శ్రద్ధ లేకుండా పోయింది. ప్రతిరోజూ ఎంతో మంది విద్యార్థులతో పాటు స్థానికులు దిన, వార పత్రికలు చదువుతారు. ఉదయం, సాయంత్రం లైబ్రేరీకి వచ్చి అనేక విషయాలు తెలుసుకుంటారు. ఇలాంటి లైబ్రేరీని మూసివేయడం బాధాకరం.

– బుగత శివ, న్యాయవాది, ప్రత్తిపాడు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ



జగ్గంపేట శివారు సీతానగరంలో ప్రతిష్ఠించిన సుబ్రహ్మణ్యస్వామివారు

జగ్గంపేట: గ్రామ శివారు సీతానగరంలో నూతనంగా నిర్మించిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. గత మూడు రోజులుగా హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన పండితులు ఆదివారం శాస్త్రోక్తంగా స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మేళ తాళాలు, కోలాటం, నృత్య ప్రదర్శనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



గెద్దనాపల్లిలో తాము గీసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, గెద్దనాపల్లి, వీరవరం గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా గెద్దనాపల్లి గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పిల్లలు తమ చిట్టిపొట్టి చేతులతో వేసిన చిత్రాలు అందరినీ అలరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి.శంఖర్, ఉపాధ్యాయులు ఆర్ఎస్‌వీ వివేక్, పి.రవిరాజా, ఎస్.వికాష్, పి.స్వామి పాల్గొన్నారు.

వెంకటరమణయ్యకు ఘన నివాళి



ఏలేశ్వరం గ్రంథాలయంలో వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: గ్రంథాలయ ఉద్యమ నాయకుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్యకు ఆదివారం పట్టణంలో ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల ఏర్పాటులో ఆయన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముసలయ్యను పరామర్శిస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండలంలోని గజ్జనపూడి గ్రామానికి చెందిన చంద్రడ ముసలయ్య ఇటీవల ప్రమాదవశాత్తూ గాయపడ్డారు. కాకినాడలో చికిత్స పొందుతున్న ఆయనను మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొనగాల అప్పలరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లు నాగేశ్వరరావు, మాగపు శివ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశలను నిలబెట్టాలి



ప్రత్తిపాడు బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై లక్ష్మీకాంతం

ప్రత్తిపాడు: విద్యార్థులు తల్లిదండ్రుల ఆశలను నిలబెట్టాలి తప్ప ఒమ్ము చేయరాదని ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం సూచించారు. ప్రత్తిపాడులోని ప్రభుత్వ బాలికల వసతిగృహం, ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతిగృహంలోని విద్యార్థినీ, విద్యార్థులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో తమ పిల్లలను ఇంటికి దూరంగా వసతి గృహాల్లో ఉంచి చదివిస్తున్నారన్నారు. పిల్లల దృష్టి చదువు మీదే ఉండాలని, దురాలవాట్లకు లోను కావద్దని హితవు పలికారు. సమాజ గతిని మార్చగలిగే శక్తి బాలికలకు ఉందన్నారు. నైతిక విలువలతో కూడిన విద్య, లైంగిన వేధింపుల నుంచి రక్షణ, బాల్య వివాహాల వల్ల అనర్థాలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలుర వసతిగృహ సంక్షేమాధికారి ఎంవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.